
సర్వసభ్య సమావేశానికి అందరూ హాజరుకావాలి

లాలాపేట: వచ్చే నెల 12న తార్నాకలోని వంజరి భవన్‌లో వంజరి కులస్తుల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించుటకు సంఘం రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించినట్లు తెలిపారు. ఆదివారం సంఘం అధ్యక్షుడు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేశం, కోశాధికారి అమరేందర్ తదితరులు ఓ పత్రికా ప్రకటనలో విడుదల చేశారు. అక్టోబర్ 12 ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ సమావేశానికి వంజరి కులస్తులందరూ తప్పకుండా హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం అకౌంట్స్ అండ్ ఆడిట్, 2012 ఎన్నికల నిర్వాహణ, నూతన నియమావళి తదితర విషయాలపై చర్చిస్తామన్నారు. యాదాద్రిలో వంజరి భవన్, ఉప్పల్ భగాయత్‌లో ఆత్మగౌరవ భవనం, వేములవాడలో వంజరి భవన్ నిర్మాణం తదితర విషయాలపై మాట్లాడతామన్నారు. ప్రస్తుత కార్యవర్గం నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను తెలియజేస్తామన్నారు. ఇక ముందు సంఘం ద్వారా నిర్వహించే కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు.

ముడావత్ శ్రీనుకు డాక్టరేట్



లాలాపేట: మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల్ నంచర్ల బోరింగ్ తండాకు చెందిన ముడావత్ శ్రీను ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్‌ను పొందారు. ఈ మేరకు ఓయూ చరిత్ర విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ బి. లావణ్య పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆఫ్ ఔరంగజేబు క్యారెక్టర్ అండ్ హిస్ డెక్కన్ వ్యూవ్ అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకు శ్రీనుకు ఓయూ పరీక్షల విభాగం డాక్టరేట్‌ను ప్రకటించింది. ముడావత్ మధు, కమిలీ బాయిల కుమారుడు పేద కుటుంబం మారుమూల గ్రామం తండా నుంచి వచ్చిన శ్రీను ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేయడంపై పలువురు అభినందనలు తెలియజేశారు.

టీజీ సీపీ గేట్ ఫస్ట్ ఫేజ్‌లో 20467 సీట్లు కేటాయింపు

లాలాపేట: తెలంగాణ స్టేట్ లెవల్ కామన్ పోస్టు గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్టు(టీజీ సీపీగేట్-2025)కు సంబంధించి పలు పీజీ కోర్సుల్లో చేరేందుకు మొదటి ఫేజ్‌లో 20467 సీట్లు కేటాయించినట్లు సెట్ కన్వీనర్ ఆదివారం మీడియాకు తెలిపారు. ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మా గాంధీ, శాతవాహన, వీరనారి చాకలి ఐలమ్మ ఉమెన్స్, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ వర్సిటీ, డా.మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సుల్లో చేరడానికి 28145 మంది అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ ఇవ్వగా మొదటి ఫేజ్‌లో 20467 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ మొదటి దశలో సీట్లు పొందిన వారు ఆన్‌లైన్ ద్వారా నిర్ణీత ఫీజు చెల్లించి ఆయా కళాశాలల్లో వచ్చే నెల 8 లోగా రిపోర్టు చేయాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

లాలాపేట: ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తార్నాక డివిజన్ సీపీఐ కార్యదర్శి సయ్యద్ గౌస్‌అలీ అన్నారు. ఆదివారం వర్షా ప్రభావిత లోతట్టు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరద ప్రభావం ఉన్న వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన పురాతన ఇళ్లలో ఉండరాదన్నారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని ప్రజలకు పలు జాగ్రత్తలను సూచించారు. అవసరమైతే తప్పా ప్రజలెవరూ బయటకు రావొద్దన్నారు. రోడ్లపై వర్షం నీరు నిల్వకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షానికి దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేయాలన్నారు. మాన్సూన్ బృందాలు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని విజ్ఞప్తి చేశారు.

గ్రూప్-1 ఉద్యోగం సాధించిన రాహుల్‌కి సన్మానం



లాలాపేట: ఇటీవల తెలంగాణ ప్రభుత్వం పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేసిన గ్రూప్-1 ఉద్యోగాల్లో ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. గాలి వినోద్‌కుమార్ సోదరుడి కుమారుడు వరంగల్ జిల్లాకి చెందిన రాహుల్ గ్రూప్- 1 మల్టీజోన్‌లో 555 ర్యాంక్‌తో ఉద్యోగం సాధించారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం తార్నాకలోని ఆర్‌పీఐ కార్యాలయంలో రాహుల్ గాలిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పెద్దనాన్న డాక్టర్ గాలి వినోద్‌కుమార్ ప్రోత్సాహంతో డా. బాబా సాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తితో కుటుంబ సహకారంతో తెలంగాణ స్టడీ సర్కిల్ ద్వారా ప్రిపరేషన్ చేసి ఈ ఉద్యోగం సాధించానన్నారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో తాను ప్రొఫెసర్‌గా తన సోదరుడి కుమారుడు గ్రూప్-1 ఆఫీసర్‌గా ఉన్నత స్థాయికి ఎదిగామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఐ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇన్‌చార్జి మేజర్ చంద్రకాంత్, కోశాధికారి మురళి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైసయ్య, హైకోర్టు న్యాయవాది చంద్రకళ, పరివర్తన, వినూత్న తదితరులున్నారు.



బేగంపేట కట్టమైసమ్మ మహాలక్ష్మిని దర్శించుకున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలో శ్రీకాత్యాయనిదేవిగా..



శ్రీమహాలక్ష్మి అలంకరణలో బేగంపేట ప్రకాష్‌నగర్ భూలక్ష్మి అమ్మవారు



బేగంపేట కట్టమైసమ్మ ఆలయంలో శ్రీలలితాదేవిగా అమ్మవారు



బౌద్ధనగర్ వెల్ఫేర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని దర్శించుకున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్ కంది శైలజ



మహాచండీ నమోస్తుతే..

దేవీ నవరాత్రులు అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆయా దేవాలయాల్లో ఆదివారం (ఏడో రోజు) అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకొని అమ్మవారికి కుంకుమార్చనలు, చండీహోమం, సహస్రనామార్చనలు నిర్వహించారు. ఆలయాల పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. ఆలయాలు, మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

– సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ జోన్ బృందం



అమ్మవారిలో సేవలో వెల్లాల రామ్మోహన్



బల్కంపేటలో ఎల్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



సనత్‌నగర్‌లో అమ్మవారి సన్నిధిలో



చండీ పరమేశ్వరి దేవిగా కనకదుర్గ అమ్మవారు



హనుమాన్ ఆలయంలో మహాలక్ష్మీదేవిగా..



అంబర్‌నగర్‌లోని మార్కండేయ దేవాలయంలో మహా చండీ హోమంలో పాల్గొన్న భక్తులు



లాలాపేటలో అన్నదానం



నార్త్‌లాలాగూడలోని నల్లపోచమ్మ ఆలయంలో..



దుర్గాదేవి పూజలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ తిరుపతి, రైల్వే జేఏసీ నాయకుడు లక్ష్మణ్



కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ సామల హేమ



చిలకలగూడలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు



మేడిబావి పోచమ్మ దేవాలయంలో మహిళల సామూహిక కుంకుమార్చనలు



లాలాగూడ రైల్వే హాస్పిటల్ క్వార్టర్స్ వద్ద చండీహోమంలో పాల్గొన్న భక్తులు

ఎన్నికల్లో విజయం సాధించిన ఖదీర్ ఖాన్ ప్యానెల్

లాలాపేట: ఓయూ ఉద్యోగ సంఘాల ఎన్నికల్లో ఎన్‌జీవోస్ స్టాఫ్ అసోసియేషన్ అబ్దుల్ ఖదీర్ ఖాన్, బీ.వెంకటేష్ ప్యానెల్ ఘన విజయం సాధించింది. ఈ నెల 27న ఎన్‌జీటీఎస్ స్టాఫ్ అసోసియేషన్, టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్లకు ఎన్నికలు జరిగిన సంగతి విదితమే. ఈ మేరకు ఆదివారం ఓయూ పాలనా భవనం, ఆర్ట్స్ కళాశాలలో 12 రౌండ్లలో ఓట్లను లెక్కించారు. నాన్ గెజిటెడ్ స్టాఫ్ అసోసియేషన్ నుంచి అధ్యక్షుడిగా అబ్దుల్ ఖదీర్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్ ప్యానెల్, అశోక్, రాకేష్ ప్యానెల్‌పై మొత్తం తొమ్మిది మంది ప్యానెల్‌లో అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి వంటి కీలక పోస్టుల్లో మొత్తం 8 మంది ఖదీర్ ఖాన్ అధ్యక్షుడు, వెంకటేష్ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షుడిగా సుదీర్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్. మల్లేశ్, సెక్రటరీలుగా ఎండీ వసీం అహమ్మద్, జాటోత్ నరసింహ, ఎస్. సుధాకర్, కోశాధికారిగా ఆర్. నరసింగరావులు విజయం సాధించారు. టెక్నికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌లో నాగరాజు, అక్బర్ ప్యానెల్ విజయం సాధించారు.



సంబరాలు చేసుకుంటున్న ఎన్‌జీవోస్ స్టాఫ్ అసోసియేషన్ ప్యానెల్ సభ్యులు

ఉత్సాహంగా అశ్వ 55వ రక్తదాన శిబిరం

సనత్‌నగర్: గత 14 సంవత్సరాలుగా థలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న అమ్మ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ (అశ్వ) ఆదివారం శ్రీనివాస్‌నగర్ వెస్ట్ కమ్యూనిటీ హాల్‌లో 55వ బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించింది. ఉత్సాహంగా జరిగిన ఈ శిబిరంలో 57 మంది రక్తదానం చేశారు. సేవ్ లైఫ్ ప్రాజెక్ట్ లీడర్ వినయ్‌మోహన్ ప్రారంభోత్సవం చేసిన ఈ కార్యక్రమంలో అశ్వ వర్కింగ్ కమిటీ నుంచి జగన్, భార్గవి, కృష్ణకుమార్, గిరి తదితరులు పాల్గొన్నారు. థలసేమియా బాధితుల కోసం ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు.



ప్యాట్నీ సెంటర్‌లో వారాహి సిల్క్స్ షోరూం ప్రారంభం

సనత్‌నగర్: వారాహి సిల్క్స్ తన నాలుగో షోరూంను సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లో శనివారం ప్రారంభించింది. దీనిని హీరోయిన్ సంయుక్తామీనన్, ప్రముఖ యాంకర్ సుమతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారాహి సిల్క్స్ అధినేత మణదీప్ యేచూరి మాట్లాడుతూ.. ప్యాట్నీ సెంటర్‌లో తమ షోరూం ప్రారంభించడం తమకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ నవరాత్రి పండుగ సీజన్‌కు ప్రత్యేకంగా బ్రైడల్, ఫెస్టివ్ కలెక్షన్లతో తమ కొత్త షోరూం వస్తోందన్నారు. ప్రతీ రూ.10 వేలు, అంతకంటే ఎక్కువ కొనుగోలు మీద ఒక 22 క్యారెట్ల బంగారు నాణెం ఉచితంగా ఇస్తున్నామన్నారు. వారాహి సిల్క్స్ తన అద్భుతమైన హ్యాండ్లూమ్, బ్రైడల్, ఫెస్టివ్ వేర్ శారీలతో కస్టమర్ల విశ్వాసాన్ని సంపాదించిందన్నారు.



వారాహి సిల్క్స్ షోరూం ప్రారంభిస్తున్న హీరోయిన్ సంయుక్తామీనన్, యాంకర్ సుమ కనకాల

అక్టోబర్ 3న అలయ్ బలయ్ వేడుక

అమీర్‌పేట: దసర శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 3న అలయ్ బలయ్ వేడుక నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ విజయలక్ష్మి తెలిపారు. ఆదివారం అమీర్‌పేట ఆదిత్యపార్క్ హోటల్‌లో ఆమె మాట్లాడుతూ.. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఉదయం 9.30 గంటలకు వేడుక ప్రారంభమవుతుందని చెప్పారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ బిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు, మాజీ సీజేఐ ఎన్వీరమణ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, వంటి ప్రముఖులతో ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రముఖ వ్యక్తులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాంచంద్రారెడ్డి, గౌతంరావు, శ్యామ్‌సుందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బౌద్ధనగర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ సూచించారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేపీ నాయకులు శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో పార్శిగుట్ట అశోక్ నగర్‌లోని అశోక్ సేవా సంఘంలో సేవ పక్వాడలో భాగంగా ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు వెంకటరమణి కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవిప్రసాద్‌గౌడ్, స్వరూపగౌడ్, కనకట్ల హరి, వెంకటేష్‌గౌడ్, బండపల్లి సతీష్, సాయి ప్రసాద్ గౌడ్, ఎమ్మార్పీఎస్ నాయకులు సంజీవ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మార్వాడీ గో బ్యాక్ ఉద్యమం

లాలాపేట: కల్తీమయం నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి మార్వాడీ గో బ్యాక్ ఉద్యమంలోకి విద్యార్థి నాయకులు రావాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా. పిడమర్తి రవి పిలుపునిచ్చారు. ఆదివారం ఓయూలో బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్(బీఎస్ఎఫ్) 19వ ఆవిర్భావ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పూలే, అంబేడ్కర్, కాన్షీరాం మహనీయుల చిత్రపటాలకు పూలమాలతో నివాళి అర్పించారు. ఆర్ట్స్ కళాశాల ఎదుట బీఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పిడమర్తి రవి మాట్లాడుతూ.. 18 ఏళ్లుగా బీఎస్ఎఫ్ విద్యార్థి సమస్యలపై అనేక పోరాటాలు చేసిందన్నారు. ఉత్తర భారతదేశ మార్వాడీలకు హైదరాబాద్ కల్తీ హబ్‌గా తయారైందన్నారు. దాన్ని అరికట్టాల్సిన బాధ్యత తెలంగాణ ప్రజలందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నిజాం కాలేజీ అసిస్టెంట్ ప్రొ. మనోహర్, బీఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఓయూ అధ్యక్షులు శ్రీశైలం, ఆరెకంటి శ్రీకాంత్, యుగంధర్, విజయ్ తదితరులున్నారు.

ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరానికి విశేష స్పందన

సనత్‌నగర్: జెక్‌కాలనీలోని స్కైమాల్ ఆవరణలో ఆదివారం జరిగిన ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 300 మందికి పరీక్షలు నిర్వహించడమే కాకుండా అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. అలాగే ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ఈఎన్‌టీ వైద్య నిపుణురాలు డాక్టర్ శిరీష లక్ష్మి నేతృత్వంలో వైద్య బృందం ఉదయం నుంచి సాయంత్రం వరకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో స్కైమాల్ అధినేతలు కంజర్ల మహేందర్‌యాదవ్, పల్లవి, జెక్‌కాలనీ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, సోమ వెంకట్, గూడ నాగిరెడ్డి తదితరులు హాజరై ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన డాక్టర్ శిరీష లక్ష్మి వైద్య బృందాన్ని అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ కోసం కృషి

అమీర్‌పేట: పర్యావరణ పరిరక్షణ కోసం హైడ్రా ఎంతో కృషి చేస్తుందని రాయల సేవా సమితి ప్రతినిధులు కొనియాడారు. ఆదివారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను మధురానగర్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా ఆయన్ను కలిసి సన్మానించి దుర్గామాత ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా సేవా సమితి వ్యవస్థాపకులు ఆర్.సీ.కుమార్ మాట్లాడుతూ.. హైడ్రా ఆధ్వర్యంలో ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలను గుర్తించి ఆక్రమణలు తొలగించి వాటికి పూర్వ వైభవం తెస్తున్నారని తెలిపారు. బతుకమ్మ కుంట చెరువును పునరుద్ధరించారని గుర్తు చేశారు. గాజుల రామారంలో ప్రభుత్వ స్థలాలను కబ్జాదారుల కంబంధ హస్తాల్లో నుంచి విముక్తి కల్పించి పర్యావరణ పరిరక్షణ వంటి కార్యాక్రమాలు చేపట్టడం సంతోషదాయకమని అన్నారు. అమీర్‌పేట మైత్రివనమ్ పరిసరాలు ముంపుకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపించాలని కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, రాజేష్, ప్రసాద్, మానిక్‌రావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



హైడ్రా కమిషనర్‌కు దుర్గామాత ప్రతిమను అందజేసిన రాయల సేవా సమితి ప్రతినిధులు

కనుల పండువగా శ్రీనివాసుడి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంతో మంగళసూత్రాన్ని భక్తులకు చూపిస్తున్న పండితులు



స్వామివారి కల్యాణానికి హాజరైన భక్తులు

చిలకలగూడ: సీతాఫల్‌మండి శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ 48వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. పద్మావతి, గోదా సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు పట్టువస్త్రాలతో అలంకరించి, మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ రాజేశ్‌కుమార్, చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ వేణుగోపాలరావు తెలిపారు. పాంచరాత్ర ఆగమ పద్ధతిలో ఆలయ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. స్వామివారు ఆదివారం సాయంత్రం గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రతినిధులు బాలభాస్కర్, ఆత్మరామసూర్య సుబ్రహ్మణ్యం, నారాయణన్, శివశంకరన్, సృజయ్‌ప్రకాశ్, షణ్ముఖరావులతో పాటు భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా బతుకమ్మ సంబురాలు

సనత్‌నగర్: జెక్‌కాలనీ ఫెడరేషన్ సహకారంతో కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జెక్‌కాలనీ నార్త్‌స్ట్రీట్‌లోని స్కైమాల్ ప్రాంగణంలో కొలువుదీరిన దుర్గామాత ఆలయం వద్ద బతుకమ్మ వేడుకలను నిర్వహించారు.ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డి ప్రభ, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రతినిధులు అనంతరెడ్డి, సుబ్బరాజు, విశ్వనాథరాజు, సోమ వెంకట్, బిల్డర్ రాజా, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయం వద్ద..

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం వద్ద జరిగిన బతుకమ్మ వేడుకలు ఆకట్టుకున్నాయి. అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జరిగిన వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉత్తమ బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద పట్టుచీరలు, పాల్గొన్న మిగతా వారందరికీ కన్సోలేషన్ బహుమతులు ఇచ్చినట్లు శేషుకుమారి తెలిపారు.



లాలాపేట బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండ కార్తీకరెడ్డి

లాలాపేట: బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఆయన సతీమణి కావ్య కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్



బతుకమ్మ ఆటల్లో ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్



జెక్‌కాలనీ స్కైమాల్ దుర్గామాత ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు